ప్రజాశక్తి

శనివారం 21 జనవరి 2023 | 5 | అనంతపురం





హిందూపురంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న విద్యార్థి, యువజన, ప్రత్యేక హోదా సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులు

హోదాతోనే భావితరాలకు భవిష్యత్తు

- బిజెపి మోసంతో రాష్ట్రానికి తీరని నష్టం
- మోడీని ఎదిరించలేని స్థితిలో జగన్మోహన్‌రెడ్డి
- ప్రశ్నించకుంటే ప్రజాద్రోహులుగా చంద్రబాబు, పవన్
- హోదా కోసం చేసే ధర్మయుద్ధంలో అందరూ పాల్గొనాలి
- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విభజన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి తీరని అన్యాయం చేసిందని, దీనిని నిరసిస్తూ భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమం సాగించాల్సిన అవసరం ఉందని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో శుక్రవారం ఉదయం విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగసభ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి గురునాథ్ సర్కిల్ వరకు 'ప్రత్యేక హోదా..ఆంధ్రుల హక్కు, విభజన చట్టాన్ని అమలు చేయాలని' నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మధు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల రాష్ట్ర నాయకులు సాకే నరేష్ తదితరులు పాల్గొన్నారు. హోదా విషయలో బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అనుసరిస్తున్న మోసాన్ని ఎండగట్టారు.

హోదా ఉద్యమాన్ని అడ్డుకుంటే చరిత్ర హీనులే..
చలసాని శ్రీనివాస్

ప్రత్యేక హోదా కోసం చేపట్టిన ఉద్యమాన్ని జీవోల పేరుతో అడ్డుకునే వారు భవిష్యత్తులో చరిత్ర హీనులుగా మిగిలిపోతారని చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో ప్రత్యేక హోదా-విభజన హామీలకై చేపట్టిన బస్సుయాత్రకు అనుమతి ఇవ్వకుండా రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ వైసిపికి కొమ్ముకాయడం సరికాదన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన బస్సుయాత్ర రాష్ట్ర భవిష్యత్తు కోసమే అన్నారు. దీనికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన మద్దతు ఇవ్వాలన్నారు. నాడు టిడిపి ప్రత్యేక హోదా కోసం తలపెట్టిన ధర్మపోరాట దీక్షలో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తొడగొట్టి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల కోసం శపథం చేశారని, అదే శపథంతో ప్రస్తుత ఉద్యమంలో పాలుపంచుకోవాలన్నారు. పవన్ కళ్యాన్ బీజేపీ చెర నుంచి బయటకు వచ్చి హోదా కోసం ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో ఉండే అన్ని రాజకీయ పార్టీలు ప్రజల వైపు ఉంటారా.? గుజరాతీ మార్వాడీల వైపు ఉంటారా..? అన్నది తేల్చుకోవాలన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం చేపట్టిన యాత్రకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు.

బిజెపి పాలనలో రాష్ట్రానికి అడుగడుగునా అన్యాయం
సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పోలవరం తదితర అన్ని విషయాల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు పి.మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారన్నారు. పార్లమెంట్ సాక్షిగా 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని బిజెపి నిలుపుకోకుండా ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేక హోదా విషయంలో బిజెపిని నిలదీయాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మౌనంగా ఉన్నారన్నారు. హోదా కోసం విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు బస్సుయాత్ర చేపడితే దీనిని అడ్డుకునేలా జగన్ ప్రభుత్వం జీవోలు తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి మోడీకి మోకరిల్లుతూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు నష్టం అని తెలిసినా కేంద్రం అమలు చేస్తున్న నల్ల చట్టాలను రాష్ట్రంలో అమలు చేయడానికి తహతహ లాడుతున్నారన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం తన తప్పును తెలుసుకుని యువజన, విద్యార్థులు రాష్ట్ర భవిష్యత్తు కోసం తలపెట్టిన బస్సుయాత్రకు అనుమతులు ఇవ్వాలని కోరారు. లేదంటే జగన్మోహన్‌రెడ్డి ప్రజాద్రోహిగా చరిత్రలో నిలచిపోతారన్నారు. ప్రతిపక్ష టిడిపి, జనసేన సైతం బిజెపిని ప్రశ్నించకుండా మౌనంగా ఉన్నాయన్నారు. ఈ పార్టీల్లో మార్పు రాకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని తెలియజేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు వారి అజెండాలను పక్కన బెట్టి ప్రత్యేక హోదా ధర్మయుద్ధంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. బస్సుయాత్రకు అనుమతి ఇవ్వాలని తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, తప్పకుండా అనుమతి వస్తుందని చెప్పారు. ప్రత్యేక హోదా సాధన కోసం తాము చేపట్టిన బస్సుయాత్రను ఆపే ప్రసక్తే లేదన్నారు.

హోదా ఉద్యమం ఆగదు..
విద్యార్థి, యువజన సంఘాలు

ప్రత్యేక హోదా కోసం ప్రస్తుతం చేపట్టిన ఉద్యమం ప్రారంభం మాత్రమే అని, ఇది ఆగదని రాష్ట్ర వ్యాప్తంగా దీనిని కొనసాగిస్తామని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ న్యాయస్థానం అనుమతి ఇచ్చిన వెంటనే హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సుయాత్ర చేపడుతాం అన్నారు. హోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రత్యేక హోదా కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఈ యాత్ర ఓట్లు.. నోట్లు... అధికారం కోసం చేస్తున్నది కాదని రాష్ట్రం భవిష్యత్తు కోసం అన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే వెంకన్న సాక్షిగా ఇచ్చిన హోదా హామీని అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో యువజన, విద్యార్థులు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు బాబావలి, రాజేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, హర్షకుమార్, చంద్రశేఖర్, మూర్తి, పవన్, భగత్, అబ్బి, మహేష్, కార్మిక సంఘం నాయకులు నరసింహులు, వినోద్ కుమార్, శివప్ప, ఇస్మాయిల్, రాజప్ప, శివప్ప, రాముతో పాటు పెద్ద ఎత్తున యువజన, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యానవన పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జి.కేశవరెడ్డి

మేలుజాతి వంగడాలు అందించేందుకు కృషి

వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జి.కేశవరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో చీనీ, దానిమ్మ, అరటి పంటలకు సంబంధించి మేలు రకం జాతి వంగడాలు అందించేందుకు కృషి చేస్తామని వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జి.కేశవరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఉద్యానవన పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు హార్టికల్చర్ సీనియర్ సీనియర్ శాస్త్రవేత్త దీప్తి, శాస్త్రవేత్త విమల స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ఉద్యానవన పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా హార్టికల్చర్ హబ్‌గా పేరుగాంచిన జిల్లాలో చీనీ, దానిమ్మ, అరటి సాగు అధికంగా ఉందని, అయితే రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం సహకారం అందిస్తున్నా, అధిక విస్తీర్ణంలో సాగు అవుతున్న చీని పంటలో మేలు జాతి వంగడాలు అందకుండా పోతున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాకుండా అతి తక్కువ చీనీ సాగు ఉన్న తిరుపతిలో కాకుండా అనంతపురంలో వంగడాల తయారీ కేంద్ర ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని బోర్డు సమావేశం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రైతులు శ్యాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బొమ్మనహాల్



రోడ్డు నిబంధనలపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఆర్డీవో విశ్వనాథ్ సూచించారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి తహశీలార్ద్ కార్యాలయం వరకూ ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారుల భద్రత గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులను వాహనంలోనే ఉంచుకోవాలన్నారు. అలాగే నాలుగు చక్రవాహదారులు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అలాగే పరిమితికి మించి వాహనాలను నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మనహాల్, గుంతకల్లు, దేవగిరి ఆటో డ్రైవర్లు, జమేదారు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి ఇన్‌ఛార్జి విసిగా విజయకుమార్



విసి కెసి.రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న విజయకుమార్

అనంతపురం : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా అనంతపురం జెఎన్‌టియు రెక్టార్ ఎం.విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. విద్యార్థులకు అన్ని రకాలుగా అందుబాటులో ఉండి విద్యాభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన విజయకుమార్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఆర్‌జియు ఛాన్సలర్ కెసి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణ మన బాధ్యత

ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-బెలుగుప్ప



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి శాంతిభద్రతలను కాపాడటం మన బాధ్యత అని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లోఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐకి సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1930పై ప్రచారం చేయాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతూ ఈ నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా బ్యాంకు ఖాతాలో నగుదును డ్రా చేసి బాధితులకు వెంటనే అందివ్వనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల స్థాయిలో మహిళా పోలీసులు సమస్యలను వారి పరిధిలోని స్టేషన్లకు అందివ్వాలన్నారు. అలాగే మిస్సింగ్ కేసులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పేకాట, మట్కా, నాటుసారాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సిఐ శేఖర్, బెలుగుప్ప ఎస్ఐ రామకృష్ణయ్య, ఎఎస్ఐ రామదాసు, జమేదార్‌లు బాల నరసింహులు, చినమల్లప్ప, నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మెచ్చిరిలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మెచ్చిరిలో పోలీస్ పికెట్

ఇరువర్గాలపై కేసులు నమోదు : డీఎస్పీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని మెచ్చిరి గ్రామంలో గడ్డిదొడ్డి స్థలం కోసం నెలరోజుల క్రితం జరిగిన వివాదం కారణంగా రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన నేపథ్యంలో శుక్రవారం పోలీస్‌పికెట్ ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో గొల్ల హనుమంతురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన గడ్డివాములు పక్కపక్కనే ఉన్నాయి. ఈనేపథ్యంలో గతనెలలో గొల్ల హనుమంతురెడ్డి కుటుంబ సభ్యులు పెరిగిన కంపచెట్లను తొలగిస్తుండగా చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ విషయంలో మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. వివాదం పోలీస్ స్టేషన్ దాకా చేరింది. ఇదే విషయానికి సంబంధించి గురువారం దాడి జరగడంతో పలువురు గాయపడి అనంతపురం ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలోని ఇరువర్గాలకు చెందిన శివరాజ్, ఆంజినేయ, తిప్పయ్య, హనుమక్క, లక్ష్మీదేవి, తిప్పక్క, హనుమంతురెడ్డి, హేమావతి, హనుమంతరాయుడు, భీమయ్య, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, సందీప్‌రెడ్డితోపాటు మరో ముగ్గురు గాయపడి చికిత్స పొందుతున్నారు. రెడ్డి సామాజికవర్గానికి చెందినవారు ఇళ్లల్లోకి చొరబడి దాడులు చేశారని యాదవ సామాజిక వర్గీయులు ఆరోపిస్తున్నారు. అయితే తమ వారిని కూడా తీవ్రంగా గాయపరిచారని రెడ్డి సామాజిక వర్గీయులు చెబుతున్నారు. ఏదిఏమైనా గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో అప్రమత్తమైన డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం మెచ్చిరి గ్రామానికి చేరుకుని పికెట్ ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో చిన్న సమస్యతో ఇరు సామాజిక వర్గాల మధ్య ఘర్షణగా మారిందన్నారు. గ్రామంలో ఎలాటి అవాంఛనీయ ఘటన జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేస్తానన్నారు. రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేష్ గురించి మాట్లాడటం వ్యర్థం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవకుండా నామినేట్ పదవి అనుభవిస్తున్న నారా లోకేష్ గురించి మాట్లాడటం వ్యర్థమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండిపడ్డారు. మంత్రి ఉషశ్రీ చరణ్, రజక సంఘం అభివృద్ధి కమిటీ రాష్ట్ర ఛైర్మన్ మీసాలు రంగన్నతో కలిసి శుక్రవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. అంతేగాకుండా జగన్‌ను ఓడిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మరోవైపు టిడిపి సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు ఏది పడితే అది మాట్లాడుతూ విజ్ఞత కోల్పోతున్నారన్నారు. తన తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి ప్రభుత్వంపై ఏది పడితే అది మాట్లాడుతున్నాడని ఆరోపించారు. అంతేగాకుండా రోజాపై దిగజారుడు వ్యాఖ్యలు చేసి టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విలువలకు తిలోదకాలు ఇచ్చాడన్నారు. రామారావు గౌరవాన్ని, పార్టీని సర్వనాశనం చేశారన్నారన్నారు. ఐదేళ్లు మీకు అధికారం ఇస్తే ప్రజలను వంచించి మోసగించడంతో తిరస్కరించారు. రాష్ట్రంలోని 150 నియోజకవర్గాల్లో కూడా టిడిపికి నాయకత్వం లేదన్నారు. టిడిపి నాయకులు వీధుల్లోకి వచ్చి సిఎం జగన్‌ను, ఎమ్మెల్యేలను తిట్టడం తప్ప.. సాధించిందేమీ లేదన్నారు. ఇకపోతే పవన్‌కళ్యాణ్ పార్టీ పెట్టిందే చంద్రబాబును అధికారంలోకి తెచ్చేందుకని ఎద్దేవా చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఎమ్మెల్యే అనంతకు కెవిపిఎస్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దళిత, గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి, వారి విద్యా, వైద్యం, ఆర్థిక, ఉపాధి, మౌళిక సదుపాయాల కల్పన కోసం ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయడానికి ఆర్డినెన్స్ తీసుకురావాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో హాజరైన అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కెవిపిఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి నీతి అయోగ్‌ను తీసుకొచ్చిందన్నారు. కేంద్ర పథకాలు, కేంద్రం సహాయం చేసే పథకాల పేరుతో దళిత, గిరిజనులకు నిధులు కేటాయిస్తోందన్నారు. కేంద్రంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించి ఖర్చు చేసే పద్ధతి ఉండేదన్నారు కేటాయించిన నిధులను సైతం దళిత, గిరిజనులకు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. కెవిపిఎస్ చేసిన పోరాట ఫలితంగా ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం అమలు చేశారన్నారు. ఇప్పటి వరకు 10 సంవత్సరాలు మాత్రమే అమలు జరిగిందన్నారు. ఈ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేసేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చేలా ఒత్తిడి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కాలనీల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాకరంగా ఉన్నాయని, వాటి మరమ్మత్తులు చేయించాలని సిపిఎం నాయకులు వెంకటనారాయణ, బాబు, మసూద్ కోరారు. అలాగే ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నగర సహాయ కార్యదర్శి మల్లెల ఎర్రిస్వామి, నరసింహులు, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు జీవరత్నం, రాజా సహాయ కార్యదర్శి దేవరాజు, డేవిడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనంతకు వినతిపత్రం సమర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్ఐ సందీప్

గుత్తి ఆర్ఐగా సందీప్

గుత్తి : గుత్తి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా సందీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న అర్ఐ గోపీనాథ్ డీటీగా పదోన్నతిపై శెట్టూరుకు బదిలీ అయ్యారు. దీంతో గత రెండు నెలలుగా అర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. అయితే తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు యల్లనూరులో అర్ఐగా విధులు నిర్వహిస్తున్న సందీప్‌ను గుత్తి ఆర్ఐగా బదిలీ చేశారు. తహశీల్దార్ మహబూబ్ బాషాను మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం అర్ఐ సందీప్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల పనులకు గడువులోగా పరిష్కారం చూపుతామని అన్నారు.

భూముల రీసర్వే పరిశీలన

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని దేవునిఉప్పలపాడు పంచాయతీ రెడ్డిపల్లి గ్రామంలో భూముల రీ సర్వే పనులను ఎడి రమేష్‌కుమార్, తహశీల్దార్ షర్మిల శుక్రవారం పరిశీలించారు. రీ సర్వే ఎలా చేయాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డిఐఒఎస్ వెంకట చైతన్య, ఐఒఎస్ రాంప్రసాద్, మండల సర్వేయర్లు మంజుల, సూరి, వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : కేశేపల్లి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వేను అధికారులు శుక్రవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రీ సర్వేలో ప్రజల నుంచి ఎదురవుతున్న సమస్యలు, వారికి ఇవ్వాల్సిన వివరణ, గ్రామ కంఠం మ్యాపులు తీసుకోవడం, వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, కొలతలు తీసే పద్ధతుల గురించి టీం సభ్యులకు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు టీములుగా ఏర్పడి వారికి కేటాయించిన విధులను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ షేక్షావలి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : మండలంలో ఖాళీ ఏర్పడిన వాలంటీర్ పోస్టుకు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో యోగానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెర్లోపల్లి గ్రామ సచివాలయానికి సంబంధించి ఒక వాలంటీర్ పోస్టు ఖాళీగా ఉందని తెలియజేశారు.

హుండీ లెక్కింపు

ఉరవకొండ : పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 129 రోజులకు గాను ఆరు హుండీలను లెక్కించగా రూ.21,83,941 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. పర్యవేక్షణాధికారిగా ఉరవకొండ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.రామతులసి, అలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, శ్రీ హనుమాన్ సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్లూరు : కందికాపుల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన డగ్ అవుట్ ఫాండ్‌ను అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వేతనాలు ఎలా అందుతున్నాయని కూలీలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 12వ తేది నుండి వేతనాలు రాలేదని కూలీలు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కూలీల ఖాతాల్లో వేతనాలు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మార్చి నెలాఖరు లోపు అన్ని కుటుంబాలు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎపిఒలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి ఈసీ విజయనాగేంద్ర రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు వెంగళరెడ్డి, బిఎఫ్‌టి రామాంజనేయరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఎంపీడీవోగా చిత్రా శ్రీనివాసులు

గుత్తి : గుత్తి మండల ప్రజా పరిషత్ అధికారిగా చిత్రా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనంతపురం అకౌంట్స్ అధికారిగా బదిలీపై వెళ్లారు. అక్కడ ఇన్‌ఛార్జిగా అకౌంట్ అధికారిగా ఉన్న చిత్రా శ్రీనివాసులు బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను పలువురు అధికారులు, సిబ్బంది కలిసి పూలమాలలతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్రా శ్రీనివాసులు

డిస్కమ్‌ల నష్టాన్ని ప్రభుత్వమే భరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్యుత్తు డిస్కమ్‌లు చెబుతున్న నష్టాన్ని ప్రజలపై వేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం గుంతకల్లుకు వచ్చిన ఆయన స్థానిక హంపిరెడ్డి భవనంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు డిస్కమ్‌లు వాటి వార్షిక ఆదాయ, వ్యయ నివేదికలను ఎపి ఈఆర్సీకి అందించాయ న్నారు. ఐతే ఆదాయ, వ్యయాలు మినహా రూ.12,798 కోట్లు నష్టం వాటిల్లిందని అందులో రూ.697 కోట్లను హై టెన్షన్ విద్యుత్తు వాడుకునే పెద్ద కంపెనీల నుండి వసూలు చేస్తామని నివేదించాయని అన్నారు. ఐతే మిగిలిన రూ.12,101 కోట్లు నష్టాన్ని ఏవిధంగా పూడ్చుకునేది ఎపి ఈఆర్సీకి నివేదించలేదన్నారు. ఐతే డిస్కమ్‌లు మిగిలిన రూ.12,101 కోట్ల నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రజలపై వేయరాద న్నారు. ఐతే డిస్కమ్‌లు సమర్పించిన నివేదికలపై సిపిఎం అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను ఎపి ఈఆర్సీ ఛైర్మన్ నాగార్జునకు మెయిల్ ద్వారా తెలియజేశామన్నారు. డిస్కములు నష్టాల్లో ఉన్నాయని చెబుతూనే మరోపక్క 12,489 మిలియన్ యూనిట్లు మిగులు విద్యుత్తు ఉందని ప్రభుత్వమే లెక్కలు చెబుతోంద న్నారు. ఐతే వాడకం కన్నా అదనంగా ప్రైవేటు విద్యుత్తు సంస్థల నుండి కొనుగోలు చేస్తున్నది ఆపితే నష్టం తగ్గుతుందన్నారు. ఒక పక్క నష్టం అంటూ మరోపక్క మిగులు విద్యుత్తు చూపడంతో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల సంప్రదాయ ఉత్పత్తులు అయిన బొగ్గు, నీరుతో వచ్చే విద్యుత్తు కాకుండా గతంలో లోపాయికార ఒప్పందాలతో అదాని, ఇతర ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేసే పవన, సౌర విద్యుత్తు అధిక ధరలకు కొనుగోలు చేయడంతో డిస్కమ్‌లు నష్టాల్లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని బిజెపికి దాసోహమై అవసరం లేకున్నా (మిగులు విద్యుత్తు చూపుతున్న) అదాని కంపెనీ నుండి విద్యుత్తు కొనుగోలు చేస్తోంద న్నారు. ఇప్పటికైనా అదాని, ప్రైవేటు కంపెనీల ఒప్పందాలు రద్దు చేస్తే డిస్కమ్‌లపై భారాలు తగ్గుతాయని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత మూడేళ్లలో జరిగిన విద్యుత్తు ప్రమాదాల్లో 210 మంది మృత్యువాత పడ్డారన్నారు. ఐతే ఈ ప్రమాదాలకు కారణం 20 ఏళ్ల క్రితం వేసిన ఎల్టీ లైన్లలో 11 కెవి (హెచ్‌టి) లైన్లుగా మార్చడంతో అధికలోడు తట్టుకోలేక తీగలు తెగిపడి అమాయక ప్రజలు చనిపోయారన్నారు. ఇవి ప్రభుత్వ హత్యాలుగానే సిపిఎం భావిస్తోందన్నారు. ఈ ప్రమాదాలపై జిల్లలో 1,070 ఫీడర్ల పరిధిలో అధికారులు సర్వేలు చేశారన్నారు. ఐతే ఆ నివేదికలు బహిర్గతం చేయలేదన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ఆలోచనను ప్రభుత్వం విరమించు కోవాలన్నారు. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ప్రజలపై వేస్తున్న అదనపు ఛార్జీలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు కసాపురం రమేష్, మారుతి ప్రసాద్, జగ్గలి రమేష్, సాకే నాగరాజు, సి.రమేష్, రాము నాయక్, గుత్తి పట్టణ, మండల కార్యదర్సులు నిర్మల, రామకృష్ణ, పామిడి మండల సహాయ కార్యదర్శి శంకర్, వజ్రకరూరు మండల కార్యదర్శి విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

నేర స్థలంలో లభ్యమయ్యే ఆధారాలే కీలకం

ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి



పరికరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి ఫక్కీరప్ప

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నేర స్థలంలో లభ్యమయ్యే ఆధారాలేన కీలకమని జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ క్లూస్ టీం విభాగం నిత్యం విధుల్లో వినియోగించే వివిధ రకాల పరికరాలు, యంత్రాల పని తీరుపై ఎస్పీ శుక్రవారం సమీక్షించారు. నేర స్థలంలో క్లూస్ సేకరించే క్రమంలో ఏ పరికరాన్ని ఎలా వినియోగించి ఆధారాలను భద్రపరుస్తారో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో ఆ విభాగం నిర్వహించిన డెమోను పరిశీలించారు. నేర స్థలంలో ఫిజికల్ ఎవిడెన్స్ కలెక్సన్‌లో భాగంగా సర్ఫేస్ ఫుట్ ప్రింట్ (డస్ట్ ప్రింట్), సంకెన్ ఫుట్ ప్రింట్ (కుంగిన పాద ముద్రలు), సూక్ష్మమైన అతి చిన్న వస్తువులను సైతం గుర్తించే అల్ట్రావైలెట్ లైట్, మాదక ద్రవ్యాలను గుర్తించే నార్కోటిక్స్ కిట్.. గన్ పౌడర్, ల్యాండ్ మైన్ తదితర పేలుడు పదార్థాలను గుర్తించే ఎక్స్‌ప్లోజివ్ కిట్, నేర స్థలం డిస్టర్బ్ కాకుండా ఉండేందుకు వినియోగించే కార్డోనింగ్ టేప్, క్రైం సీన్ ప్రొటెక్షన్ కిట్ తదితర పరికరాలు క్లూస్ సేకరణలో ఎలా పని చేస్తున్నాయో ఎస్పీ డెమో ద్వారా సమీక్షించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, క్లూస్ టీం ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ తిమ్మరాజు, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ హాలు మహిళలకు ఇవ్వండి

ఎమ్మెల్యే అనంతను నీలదీసిన విజయశ్రీరెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాలు తీసుకున్నారు..వాటిని తక్షణమే మహిళా గ్రూపులకు అప్పగించాలని టిడిపి నగర మహిళా విభాగం అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం 42వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, టిడిపి మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి తాను కార్పొరేటర్‌గా వున్నప్పుడు ఇక్కడ మహిళల అభ్యర్థన మేరకు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సహకారంతో కమ్యూనిటీ హాలు నిర్మించారన్నారు. కమ్యూనిటీ హాల్ లాక్కొని సచివాలయానికి అప్పచెప్పడం సరికాదన్నారు. రెండేళ్ల క్రితమే అర్జీ కూడా ఇచ్చామని, వేరొకటి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు చేపట్టలేదని నిలదీశారు. మహిళలపై గౌరవం చిత్తశుద్ధి వుంటే వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో జేజేఎం బృందం పర్యటన

గుత్తి : మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ జలజీవన్ మిషన్ ప్రాజెక్టు బృందం శుక్రవారం పర్యటించలింది. కొజ్జేపల్లి, చెర్లోపల్లి, అవగానిదొడ్డి, పెదొడ్డి గ్రామాలలో జాతీయ జల జీవన్ మిషన్ అధికారులు డాక్టర్ కపిల్‌దేవ్ శర్మ, కులదీప్ లు ఇంటింటి కొళాయి పథకం అభివృద్ధి పనుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ రాజ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి పథకం సక్రమంగా అమలు చేస్తామన్నారు, 2024 నాటికి ప్రతి ఇంటికీ కొళాయి పథకంతో సురక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా జలజీవన్ మిషన్ ప్రాజెక్టు అధికారి నాగార్జున రెడ్డి, సీఈవో కె.ఉస్మాన్, ఈవోఆర్డీ శివారెడ్డి, కో-ఆర్డినేటర్ మౌళీశ్వర్, హరినాథ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపై బురదజల్లొద్దు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపై ఎపి ఎన్జీవో సంఘం చేస్తున్న అసత్య ఆరోపణలు, బురదజల్లే కార్యక్రమాన్ని ఆపాలని, లేనిపక్షంలో తాము కూడా అదే స్థాయిలో ఎపి ఎన్జీవో సంఘంపై మాట్లాడాల్సి వస్తుందని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపినాథ్, రామునాయక్ అన్నారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగుల జీతభత్యాలు, అరియర్స్, డిఎ తదితర వాటి కోసం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ఎన్జీవో సంఘం నాయకులు వచ్చినా అభ్యంతరం ఏమిటో చెప్పాలన్నారు. ఏ సంఘం నాయకులైనా అంతా ప్రభుత్వ ఉద్యోగులే అన్న విషయాన్ని మరిచి తోటి సంఘం అధ్యక్షుడిని వ్యక్తిగతంగా ఖబడ్దార్ అంటూ బెదిరించేలా బండి శ్రీనివాస్ వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ దయా దాక్షిణ్యాలతో రెండు సంవత్సరాలు ఉద్యోగ కాలాన్ని పెంచుకున్న ఆయన ఈ విధమైన చౌకబారు వ్యాఖ్యల ద్వారా రుణం తీర్చుకుంటున్నారా అంటూ ప్రశ్నించారు. కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన ఉద్యోగులను కూడా కించపరిచే విధంగా బండి శ్రీనివాసరావు మాట్లాడారని ఉద్యోగుల పట్ల ఉన్న నిబద్ధతను బైటపెట్టారన్నారు. ఇలాంటి వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ఎపిజిఇఎ నాయకత్వం చేపడుతున్న వ్యూహాత్మక రచనలను దారి మళ్లించేందుకు ఎపి ఎన్జీవో సంఘం ఈ తరహా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఉందన్నారు. మీకు అలాంటి అవకాశం ఉండదని, ప్రభుత్వ ఉద్యోగులంతా చైతన్య వంతులుగా ఉన్నారన్నారు. మీ ఆగడాలు ఇక ముందు సాగనివ్వబోమని హెచ్చరించారు. ఉద్యోగ సంఘాలుగా సంప్రదాయంగా ఉంటే సరి లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర అధ్యక్షులు రఫీ, కార్యదర్శి ఓబిరెడ్డి, రూరల్ అధ్యక్షుడు నాగేశ్వరయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

నేడు జనసేన పిఎసి సభ్యులు నాగబాబు జిల్లా పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీ పీఏసీ సభ్యులు కొణిదెల నాగబాబు శనివారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం జనసేన పిఎసి సభ్యులు నాగబాబు ఉమ్మడి కర్నూల్ జిల్లా సమావేశం ముగించుకుని అదే రోజు సాయంత్రం 5 గంటలకు గుత్తి టోల్‌గేట్ వద్దకు విచ్చేస్తారన్నారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పార్టీ నాయకుల స్వాగత కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 6 గంటలకు అనంతపురం తపోవనం వద్ద నాగబాబుకు స్థానిక నాయకులు స్వాగతం పలుకుతారన్నారు. 22వ తేది ఆదివారం ఉదయం నగరంలోని అలెగ్జాండర్ హోటల్ నుండి ఐరన్ బ్రిడ్జి, గాంధీ రోడ్డు మీదుగా పాతూరులోని తాడిపత్రి బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ నుండి చెరువు కట్టమీద కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 10.30 గంటలకు అలెగ్జాండర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన వీర మహిళల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటలకు కార్యకర్తల సమావేశంలో నాగబాబు పాల్గొంటారన్నారు. పార్టీ విధి విధానాలను, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు అవలంబించాల్సిన అంశాలను వివరిస్తారని పేర్కొన్నారు. సమిష్టి కృషితో పీఏసీ సభ్యులు నాగబాబు జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

బుక్కరాయసముద్రం : రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర జట్టుకు సంజయ్‌రెడ్డి 8వ తరగతి, అఖిల్ 8వ తరగతి, అండర్-14 బాలికల జట్టుకు కీర్తన 9వ తరగతి, పావని 9వతరగతి, పూజిత 9వతరగతి, లక్ష్య 9వ తరగతి, అండర్-17 బాలుర జట్టుకు నారాయణస్వామి 9వ తరగతి, శివ 9వ తరగతి, అండర్-17 బాలికల జట్టుకు నాగనందిని ఎనిమిదవ తరగతి, నాగ సాహిత్య 8వ తరగతి, లక్ష్మి 9వ తరగతి, ఎంపికైనట్లు పిడి గోపాల్‌రెడ్డి తెలియజేశారు. వీరు ఈనెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నందు జరుగు పోటీలలో అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు ఆశీస్సులు అందజేశారు.

కంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఖరీఫ్‌లో రైతులు పండించిన కంది పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంది పంట కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పంటను పండించిన రైతులు శనివారం నుండి పట్టాదారు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, ఆధార్ కార్డులను తీసుకుని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మండలంలో 2022 ఖరీఫ్‌లో మొత్తం 3255 ఎకరాల్లో రైతులు కంది పంటను సాగుచేశారన్నారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్న కంది పంట క్వింటాల్ ధర రూ.6660గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వ్యవసాయాధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ

అనంతపురం : అనంతపురం జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం డైరీని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ యాక్టులు పొంది పరిచారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ డైరీని ఓ మార్గదర్శిగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిలా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్, అగ్రి అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ నాగిరెడ్డి, ఏపీసీసీబీ ఛైర్మన్, అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకటకుమార్, కోశాధికారి శ్యామసుందర్ రెడ్డి, అదనపు కార్యదర్శి చిన్నమ్మ, సభ్యులు సోము, రాకేష్ నాయక్, పెన్నయ్య, శంకర్ లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి పట్టణ పోలీసులపై ప్రయివేటు కేసు

తాడిపత్రి : తాడిపత్రి టౌన్ సిఐ, ఎస్ఐలపై మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు నందు శుక్రవారం ప్రయివేటు కేసు వేశారు. ఈ సందర్భంగా జెసి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ ఆహ్వానం మేరకు పురపాలక సంఘం ఛైర్మన్‌గా ప్రభుత్వం అందజేస్తున్న నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ ప్రకారం తాను ఈనెల 3వ తేదీన పాల్గొనాల్సివుందన్నారు. అయితే తాడిపత్రి టౌన్ సిఐ ఆనందరావు, ఎస్ఐ ధరణిబాబు తనను అక్రమంగా అడ్డుకుని గృహనిర్బంధం చేశారన్నారు. వారిపై తాడిపత్రి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశానని తెలియజేశారు.

26న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

ఉరవకొండ : రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 26వ తేదీన అనంతపురం నగరంలో చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని ఐదుకల్లు సదాశివన్ భవనం వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ పోస్టర్లను విడుదల చేశారు. అఖిలభారత రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు గోపాల్, మనోహర్, మధు, సుల్తాన్, నాయకులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండలం పరిధిలోని దేవుని ఉప్పలపాడు గ్రామంలో జెడ్పిటిసి రమాదేవి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి రామ్మూర్తిరెడ్డి, జాతీయ ఉపాధి హామీ పథకం మెంబర్ వేమనాథరెడ్డి, ముచ్చుకోట అమర్నాథ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి, గార్లదిన్నె సింగిల్‌విండో ప్రెసిడెంట్ అమర్నాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సింగనగుంటపల్లి రాజు, శివారెడ్డి, జనార్దన్ రెడ్డి, తురకపల్లి లక్ష్మిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి చర్లపల్లి రాముడు జూటూరు ఎంపిటిసి అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

అనంతపురం : అనంతపురం ట్రాన్స్‌కో కార్యాలయంలో మూడు రోజులపాటు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలువురు మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డిస్కంలో ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం శనివారం నాటితో ముగియనుంది. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్ర, ఎఈ రమేష్, గోపి, షణ్ముఖం తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నార్పల : బి.పప్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్, హిందీ ఉపాధ్యాయుడు జూటూరు షరీఫ్ అట్టలు, స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ఐ రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడికాకుండా ఇష్టపడి చదవాలన్నారు. మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం జూటూరు షరీఫ్‌ను విద్యార్థులు, పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ బండి పెద్దన్న ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకట్రాముడు, రామన్న, నాగరాజు, బాలమధు, నాగమణి, కొండారెడ్డి, రమణారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోతురాజుకాలువలో 'ఫ్రైడే డ్రైడే'

శింగనమల : తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోతురాజు కాలువలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగ్యూ నివారణలో ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని తెలియజేశారు. అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి నూర్‌బాషా, సూపర్‌వైజర్ శేఖర్, ఎంపిహెచ్ఇఒ గోవింద్, ఆరోగ్య కార్యదర్శి హేమలత, పంచాయతీ సెక్రటరీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు కరపత్రాలు విడుదల

అనంతపురం : నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో 'డిజిటల్ టెక్నాలజీ నందు పోకడలు, సవాళ్లు, అవకాశాలు' అన్న అంశంపై మార్చి 24, 25 తేదీల్లో నిర్వహించే జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జాతీయ సెమినార్ కన్వీనర్ లెఫ్టినెంట్ డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ.. నాల్గవ పారిశ్రామిక విప్లవం వ్యాపార వాతావరణాన్ని మార్పులకు గురిచేసి, సాంకేతిక ఆవిష్కరణలకు దారితీసి, చివరికి అంతరాయం కలిగించే సాంకేతికతకు దారితీసిందన్నారు. వీటి పట్ల అసాధారణమైన అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. ఈ జాతీయ సెమినార్ ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేయబోతున్నామని తెలిపారు. విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లా ప్రభుత్వ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, వాణిజ్య, నిర్వహణ శాస్త్ర అధ్యాపకులు, నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

గార్లదిన్నె : కుప్పలకొండ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబులమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా రోజుకు 60 మందికి ఆధార్ సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్ ఈవోఆర్డీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ప్రాణాలకు ముప్పు

ఉరవకొండ : బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా ప్రాణాలకే ముప్పు కలుగుతుందని రాకెట్ల పిహెచ్‌సి ప్రభుత్వ వైద్యాధికారి పావని అన్నారు. శుక్రవారం రాకెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. బాల్యవివాహాల నివారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ (చిన్న వయసులోనే గర్భధారణ), గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం గురించి విద్యార్థినులకు అవగాహన కలిగించారు. చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలకు గురించి వివరించారు. బాల్యవివాహాల వల్ల చదువు పాడవుతుందని, బంగారు భవిష్యత్తు బుగ్గిపాలవుతుందన్నారు. గర్భధారణ వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. విద్యార్థినులు చదువు మీద దృష్టిసారించి భవిష్యత్తును చక్కదిద్దుకోవాని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ మాట్లాడుతూ తల్లిదండ్రులు మగపిల్లల మీద ఇష్టంతో ఆడపిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆడా, మగ తేడాలు సరికాదని, లింగవివక్ష వద్దని సూచించారు. ఫ్యాఫ్టో చట్టంలోని శిక్షల గురించి వివరించడంతోపాటు విద్యార్థులకు, అమ్మాయిలకు ఎదైనా ఆపద వస్తే ఫోన్ చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్లను తెలిచేయజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, వైద్య సిబ్బంది సుంకన్న, పద్మావతి, సిఒ భగవాన్ దాస్, ఆనంద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

పెద్దవడుగూరు : వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని గుంతకల్లు ఆర్టీవో రాజాబాబు, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దవడుగూరు మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం, మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్సులను తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండీషన్‌లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరణ

నార్పల : అమరావతిలో సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 22న జరిగే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆ పార్టీ నాయకులు స్థానిక తిక్కయ్య స్వామి ఆలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడుతూ.. జగనన్న ఇళ్ల పట్టాలు, ఇంటి నిర్మాణానికి ఇస్తున్న డబ్బులు తదితర సమస్యలపై ఈనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన కలెక్టరేట్ల ముట్టడి, 22వ తేదీన అమరావతిలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి గంగాధర్, నూర్‌బాషా, రైతు సంఘం మండల కార్యదర్శి మారుతి, జోసెఫ్, దిలీప్ నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగిని మృతికి సంతాపం

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ ఉద్యోగిని మాబున్ని మృతికి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థలో అటెండర్‌గా నియమితులై డెప్యూటేషన్‌పై పన్ను వసూళ్ల కేంద్రంలో మాబున్నీ విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ఆమె గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో మాబున్నీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.